క్లుప్తంగా

ఎన్నికల కోడ్‌ను అమలు చేయాలి

పటమట(విజయవాడతూర్పు): కృష్ణా – గుంటూరు ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్స్ ఎన్నికల నేపథ్యంలో కోడ్‌ను కచ్చితంగా అమలు చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో జాతీయ నాయకులను మినహాయించి, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయాలని సూచించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఫ్లెక్సీలు, బ్యానర్లను తక్షణమే తొలగించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో మాఘమాస పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో గురువారం మాఘమాసం పురస్కరించుకుని శ్రీధర్మ పరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన యంత్ర పూజ, సూర్య నమస్కారాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

7 నుంచి శ్రీదత్తసాయి మందిర వార్షికోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరం 10వ వార్షికోత్సవాలు వచ్చేనెల ఏడు నుంచి తొమ్మిదవ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీర మోహనరావు తెలిపారు. మందిర 10వ వార్షికోత్సవ కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు వార్షికోత్సవాల్లో పాల్గొని బాబా వారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు.

బీసీలను నిలువునా ముంచిన చంద్రబాబు

ఏపీ బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వేముల బేబిరాణి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బీసీలను చంద్రబాబునాయుడు నిలువునా ముంచివేశారని హైకోర్టు అడ్వకేట్, ఏపీ బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, ఆంధ్రప్రదేశ్ వడియ రాజుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వేముల బేబిరాణి గురువారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్‌లో చెప్పిన బీసీలకు 50 ఏళ్లకు పెన్షన్ ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. బీసీలకు చట్టబద్ధంగా రాష్ట్రంలో కుల గణన వెంటనే చేపట్టాలన్నారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేలు, మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తానని.. కరెంటు ఛార్జీలను తగ్గిస్తానని చెప్పి ప్రజలపై పెనుభారాన్ని మోపుతున్నారని ఎద్దేవా చేశారు. ఆనాడు రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని హేళన చేసిన చంద్రబాబు, నేడు సూపర్ సిక్సులు అమలు చేయడానికి ఖజానాలో డబ్బులు లేవని చేతులెత్తేయడం సిగ్గుచేటన్నారు.

దుప్పట్ల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు జన్మదినం పురస్కరించుకుని గురువారం ముత్యాలంపాడు డీ మురళీ కృష్ణంరాజు ఆధ్వర్యాన పేదలకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కమర్షియల్ వెహికల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పెనుమత్స అప్పలరాజు ముఖ్య అతిథిగా పాల్గొని దుప్పట్లు అందజేశారు. అప్పలరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తోటివారికి సాయం చేయడం అలవాటుగా చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దర్శనాల దళారీపై ఫిర్యాదు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో దర్శనాలు చేయిస్తానని భక్తుల దగ్గర భారీగా డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్న దళారీపై గురువారం వన్‌టౌన్ పోలీసులకు ఆలయ అధికారులు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పెనమలూరు మండలం కానూరు గ్రామానికి చెందిన కారుబిల్లి శ్రీనివాసరావు (58) కనకదుర్గానగర్‌లో కొబ్బరికాయలు విక్రయిస్తున్నాడు. రద్దీ రోజుల్లో అమ్మవారి దర్శనానికి దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను దర్శనం చేయిస్తానంటూ శ్రీనివాసరావు వారి నుంచి డబ్బుల వసూలు చేస్తున్నాడు. ఆలయ సిబ్బందితో సంబంధాలు పెట్టుకొని కొన్ని టిక్కెట్లు తీసుకొని వారికి దర్శనాలు చేయించటం చేస్తుంటాడు. దీనిని గుర్తించిన ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి జె.శ్రీనివాసులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు తవ్వి.. పూడ్చటం మరిచారు.!

- ప్రమాదకరంగా గుంతలు
- వాటర్ వర్క్స్ పనులతో తప్పని తిప్పలు



రావిచెట్టు సెంటర్‌లో గుంతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో వాటర్ పైపులైన్ పనులు ఎంకి పెళ్లి సుబ్బి చావుకి వచ్చిన చందంగా మారింది. పాతకాలం నాటి పైపులైన్‌లను మార్చడంతో పాటు పెరిగిన జనాభాకు అనుగుణంగా స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో నగరంలో వాటర్ పైపులైన్ పనులు ప్రారంభించారు. అయితే వాటర్ వర్క్స్ సిబ్బంది రోడ్డును తవ్వి పైపులైన్లు వేస్తున్నారు. రోడ్డును తవ్వడంలో చూపిస్తున్న శ్రద్ధ పూడ్చటంలో చూపించడం లేదు. అలాగే కనెక్షన్లు ఇచ్చే సమయంలో సైతం సిబ్బంది చేతివాటం చూపిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. పాత వాటికి ఉచితంగా కనెక్షన్ ఇవ్వాల్సి ఉండగా అందినకాడికి దండుకుంటున్నారు.

తవ్విన వ్యర్థాలు రోడ్లపైనే

వాటర్ పైపులైన్ పనుల కోసం తవ్విన గోతులను సక్రమంగా పూడ్చకపోవడంతో గోతులమయంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే వీవీనరసరాజు రోడ్డు, ముత్యాలంపాడు, అంబేడ్కర్ కాలనీ తదితర ప్రాంతాల్లో గోతులు వాహన చోదకుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. తవ్విన గోతుల్లో తూతూ మంత్రంగా మట్టిని పోసి వదలివేస్తున్నారు. దీంతో మట్టి కుంగిపోయి గుంతలు పడుతున్నాయి. దీంతో వాహనచోదకులు, పాదచారులు తరచూ కింద పడి గాయాల పాలవుతున్నారు. అలాగే తవ్విన రోడ్డు వ్యర్థాలను తరలించకుండా రోడ్లపైనే వదలివేయడం వల్ల రాత్రిపూట చీకటిలో వాహన చోదకులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. వాటర్ పైపులైన్ పనులు వేగవంతం చేయాలని, తవ్విన గోతులను వెంటనే పూడ్చివేయాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.



ముత్యాలంపాడు శ్రీ కోదండ రామాలయం మలుపులో..



గొట్టుముక్కల సూర్యనారాయణరాజు నగరపాలకసంస్థ పాఠశాల సమీపంలో గుంతలు



మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డులో పనులు పూర్తి అయినా తొలగించని వ్యర్థాలు

స్టీల్ మాయమైన కేసులో అధికారులపై చర్యలకు ఆదేశం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ గొడౌన్‌లోని స్టీల్ మాయమైన ఘటనలో అధికారులపై చర్యలకు ఆ సంస్థ ఎండీ రాజాబాబు ఆదేశించారు. ఈ మేరకు సంస్థ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. రూ. 1.95కోట్లు విలువైన 271 మెట్రిక్ టన్నుల స్టీల్ మాయమైనట్లు విచారణలో తేలిందని పేర్కొన్నారు. దీనిపై ఒక అసిస్టెంట్ ఇంజినీరు సస్పెన్షన్, ఇద్దరు ఉద్యోగులపై క్రిమినల్ చర్యలకు ఆదేశించామని తెలిపారు. ఇద్దరు పీడీలు, ఇద్దరు ఈఈలు, నలుగురు డీఈఈలకు షోకాజు నోటీసులు, నలుగురు రిటైర్డ్ అధికారులకు బెనిఫిట్స్ నిలిపివేస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఎండీ రాజబాబు పేర్కొన్నారు.

కుష్టు లక్షణాలపై అవగాహన అవసరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): కుష్టు లక్షణాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి సూచించారు. కుష్టు అవగాహన పక్షోత్సవాల సందర్భంగా గురువారం నగరంలోని రాజీవ్‌నగర్ ఆయుర్వేదిక్ ఆస్పత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ.. కుష్టు రోగుల్లో మనోధైర్యం కలిగించేందుకు కౌన్సిలింగ్ చేయాన్నారు. అనంతరం అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి, అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరావు, డాక్టర్ రాథోడ్ పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ జీవితం నేటి తరానికి ఆదర్శం

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

లబ్బీపేట(విజయవాడతూర్పు): దేశానికి స్వాతంత్య్రం సాధించి పెట్టిన గాంధీ మహాత్ముడి జీవితం నేటి తరానికి ఆదర్శమని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. మహాత్మగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం కస్తూరిబాయిపేట గాంధీబొమ్మల సెంటర్ వద్ద మహాత్మ గాంధీ విగ్రహానికి స్థానిక కార్పొరేటర్ కుక్కల అనితతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మల్లాది విష్ణు మాట్లాడుతూ గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాకారానికి అందరూ పాటుపడాలని కోరారు. ఆ మహనీయుని ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బెల్లపు వెంకట్రావు, మరియరాణి, కాజ శంకర్, కుక్కల రమేష్, కొమ్ము చంటి, మనోహర్, ఈడీపీ శ్రీను, మోహన్ రావు, కాళ్ల శ్రీను, ప్రేమ్, సుబ్బారావు, సింధు, రత్న పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె. భాగ్యలక్ష్మి అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేటి యువత గాంధీ స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. చరిత్ర శాఖ విభాగాధిపతి డాక్టర్ బి. ప్రకాశం, అధ్యాపకులు అజయ్ బాబు, ఉమా తరంగణి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మాచవరంలో గాంధీ స్మారక నిధి, దక్షిణ భారత హిందీ ప్రచార సభ, హిందీ బీఈడీ కళాశాల సంయుక్త ఆధ్వర్యాన గాంధీ వర్ధంతి నిర్వహించారు. మహాత్మా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. హిందీ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చారులత, గాంధీ స్మారక నిధి, దక్షిణ భారత హిందీ ప్రచార సభ సిబ్బంది పాల్గొన్నారు. బీఆర్టీఎస్ రోడ్డులో డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బీ వసంతకుమార్ గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. సభ్యులు కోరంగి నాగమల్లీశ్వరి, ఎస్‌కే షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.



మాచవరం హిందీ కళాశాలలో గాంధీజీ విగ్రహానికి నివాళులు



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

బెజవాడ బార్ అసోసియేషన్ హాల్లో..

విజయవాడస్పోర్ట్స్: జాతిపిత మహాత్మా గాంధీ 77వ వర్ధంతి కార్యక్రమం బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) హాల్లో గురువారం జరిగింది. బీబీఏ కార్యదర్శి అరిగల శివరామ ప్రసాద్(రాజా), ప్రముఖ న్యాయవాదులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్య్ర ఉద్యమంలో గాంధీజీ చేసిన పోరాటాన్ని ఈ సందర్భంగా రాజా కొనియాడారు. గాంధీజీ చూపిన అహింసా వాదాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యులు సురాబత్తుల మల్లేశ్వరరావు, చలసాని అజయ్ కుమార్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు వి.గురునాథం, వేముల హజరతయ్య గుప్తా, సంపర దుర్గాశ్రీనివాస్, మహిళా సెక్రెటరీ రాజ్యలక్ష్మి, లైబ్రరీ మాజీ సెక్రెటరీ కండెల వరప్రసాదరావు పాల్గొన్నారు.

మహాత్ముడికి ఘన నివాళి

పటమట(విజయవాడతూర్పు): బ్రిటీష్ పాలన నుంచి దేశానికి అహింసతో స్వాతంత్య్రం సాధించిన మహాత్మ గాంధీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్లో గురువారం గాంధీ వర్ధంతి సందర్భంగా మహాత్ముడి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ భారత్ అంటూ సంకల్పించిన మహాత్ముని మార్గదర్శకాలలో మనం నడవాలని కమిషనర్ అన్నారు. అడిషనల్ కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి.ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, అకౌంట్స్ ఎగ్జామినర్ చక్రవర్తి, ఎకౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్

వాటర్‌ట్యాంక్‌ను వినియోగంలోకి తేవాలి

పటమట(విజయవాడతూర్పు): సర్కిల్–2 పరిధిలోని 30వ డివిజన్‌లో గద్దె వెంకట రామయ్య నగర్‌లో(జీవీఆర్‌నగర్)లో వీఎంసీ నిర్మించిన వాటర్‌ట్యాంకును త్వరితగతిన స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం దేవీనగర్, మధురానగర్, జీవీఆర్ నగర్ ప్రాంతాల్లో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీవీఆర్ నగర్లో నిర్మించిన 1500 కిలోలీటర్ల సామర్థ్యం గల రిజర్వాయర్‌కు డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్‌ను త్వరితగతిన ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానికులకు త్వరితగతిన తాగునీటి సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. అమృత్ 2.0 పథకం కింద చేస్తున్న ఈ పనులను వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి.ప్రసాద్, సూపరింటెండెంట్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఇంచార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



వాటర్‌ట్యాంక్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

జీజీహెచ్‌లో ప్రివెంటివ్, వెల్నెస్ క్లినిక్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వాస్పత్రి సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో కమ్యూనిటీ మెడిసిన్ విభాగానికి అనుబంధంగా ఏర్పాటు చేసిన ప్రివెంటీవ్, వెల్నెస్ క్లినిక్‌ను గురువారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావుతో కలిసి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాధాన్యత పొందిన జీవనశైలి వ్యాధులను ముందుగా నిర్ధారణచేసేందుకు, ప్రజలకు ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తెలియజేసేందుకు ఈ క్లినిక్ దోహదం చేస్తుందన్నారు. ఈ క్లినిక్ ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని వైద్యులకు సూచించారు. ప్రతి సోమ, బుధవారాల్లో ఈ క్లినిక్ అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ వి.మాధవి, ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌ఓడీ డాక్టర్ ఏఆర్‌సీహెచ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



వెల్నెస్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ వెంకటేశ్వరరావు

కోవిడ్ సమయంలో అమరులైన వైద్యులకు నివాళి

లబ్బీపేట(విజయవాడతూర్పు): కోవిడ్ బారిన పడిన వారికి వైద్య సేవలు అందిస్తూ, ఆ మహమ్మారి బారిన పడి అమరులైన వైద్యులకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నివాళులర్పించింది. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి రోజున అమరులైన జవాన్ల సంస్మరణ దినోత్సవం జరుపుకొంటారని, అదే రీతిలో ఐఎంఏ అమరులైన వైద్యుల సంస్మరణ దినం నిర్వహిస్తున్నామని తెలిపారు. విజయవాడ గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.నందకిషోర్ మాట్లాడుతూ.. కోవిడ్ బారిన పడి దేశ వ్యాప్తంగా రెండు వేల మంది వైద్యులు అమరులయ్యారని పేర్కొన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఐఎంఏ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎస్.అగర్వాల్, పూర్వ జాతీయ ఉపాధ్యక్షుడు పొట్లూరి గంగాదరరావు వంటి వారు ఎందరో ప్రాణాలు అర్పించారని గుర్తుచేశారు. వారిని కోవిడ్ అమర వైద్యులుగా గుర్తించడం సముచితంగా భావిస్తున్నామన్నారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా క్యాండిల్స్ వెలిగించి వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.సుభాష్‌చంద్రబోస్, నగర అధ్యక్షుడు డాక్టర్ బోడేపూడి హనుమయ్య, డాక్టర్ ఎంఏ రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.



కోవిడ్ అమర వైద్యులకు నివాళులర్పిస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

రైల్వే పెండింగ్ పనులపై చర్చ లేకపోవడం బాధాకరం



మల్లాది విష్ణు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): నగరంలోని సెంట్రల్ నియోజకవర్గం పరిధిలో ప్రధానంగా నెలకొన్న రైల్వే సమస్యలపై జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో కనీసం ప్రస్తావన రాకపోవడం బాధాకరమని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు గురువారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ దేవీనగర్ వైపు నుంచి వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని చెప్పారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో వచ్చిన విజ్ఞప్తుల మేరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రామకృష్ణాపురం నుంచి దేవీనగర్ వరకు ప్రధాన రహదారిని అనతికాలంలోనే పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. కానీ రైల్వే అనుమతులు రాకపోవడంతో దేవీనగర్ రైల్వే వంతెన కింద కొంతమేర రహదారి పనులు నిలిచిపోయాయని గుర్తుచేశారు. దీని కారణంగా ఆ ప్రాంత వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. అదేవిధంగా శ్రీనగర్ కాలనీలోనూ అడ్డంగా కట్టిన గోడ కారణంగా అక్కడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బుధవారం జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో కలెక్టర్, రైల్వే డీఆర్ఎం, ఎంపీ, వీఎంసీ కమిషనర్ సహా కీలక అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనప్పటికీ ఇటువంటి ప్రధాన అంశాలపై చర్చ జరగకపోవడం బాధాకరమన్నారు. ఇదే విధంగా సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో ప్రజలు నేరుగా ఇబ్బందులకు గురవుతున్న రైల్వే అంశాలు అనేకం ఉన్నాయని మల్లాది విష్ణు పేర్కొన్నారు. వీటన్నింటిపై పార్లమెంట్ సభ్యులు, రైల్వే అధికారులు దృష్టి సారించాలని లేనిపక్షంలో ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా వ్యవహరిస్తున్న రైల్వే అధికారుల తీరుపై వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

5 నుంచి స్పోకెన్ ఇంగ్లిషు క్లాసులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఫిబ్రవరి ఐదో తేదీ నుంచి స్పోకెన్ ఇంగ్లిషు క్లాసులను ప్రారంభిస్తున్నట్లు ఆ కేంద్రం మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు టి.క్రాంతికిరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఆపైన చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలవారు రాఘవయ్య పార్కు సమీపంలోని కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 73821 93413 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, రామకృష్ణాపురం, దేవీనగర్ తదితర ప్రాంతాల్లో దోమల నివారణ చర్యలు వేగవంతం చేయాలని కార్పొరేటర్ బీ జానారెడ్డి సూచించారు. డివిజన్‌లో మలేరియా నివారణ, పారిశుద్ధ్య పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన దోమలు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఖాళీస్థలాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని, మురుగుకాలువలను శుభ్రం చేయడంతో పాటు చెత్తచెదారం తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, మలేరియా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



సినీ నటుడు బాలకృష్ణకు అభినందనలు

విజయవాడ కల్చరల్: సినీ నటుడు నందమూరి బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రకటించిన సందర్భంగా కళా సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికపై గురువారం నిర్వహించిన కార్యక్రమంలో అభినందనలు తెలియజేశారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ బాలకృష్ణ ఎన్టీఆర్ వారసుడిగా సినీ రంగ ప్రవేశం చేసి, తన తల్లి బసవ తారకం పేరుతో క్యాన్సర్ ఆసుపత్రిని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్స్, కే డేవిడ్‌రాజు, మారేపల్లి జోషి, ఆదిరాల జయప్రభు, మధుసూధనరావు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకుడికి సత్కారం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ విభాగంలో సీనియర్ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.వి.వి.రమణ తూర్పు గోదావరి జిల్లా ఏటిపాక గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ విభాగాధిపతిగా ఉద్యోగోన్నతి పొందారు. రమణను గురువారం కళాశాల మెకానికల్ విభాగాధిపతి కె.విజయభాస్కర్, అధ్యాపకులు సాయికుమార్, బాపూజీ, సందీప్, మధుసూదనరావు, బి.బి.ఆర్.కె.ప్రసాద్, దుర్గాదేవి, రాంబాబు, వెంకటేశ్వరరావు, నాగార్జున, దుర్గామల్లేశ్వరి, లచ్చిరామ్, జయరామ్, స్వర్ణలత, సుమతి తదితరులు సత్కరించారు.